# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఆదేశించారు.**

**2.** **మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.**

**3.** **రాష్ట్రంలోని దేవాలయాల్లో అన్నప్రసాదాల నాణ్యతను పెంచామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**

**4.** **రియల్ ఎస్టేట్ రంగానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వీయ దృవీకరణ పథకం 2025'ను ప్రవేశపెట్టింది.**

**5.** **ప్రముఖ నటుడు, శాసన సభ మాజీ సభ్యులు కోట శ్రీనివాసరావు హైదరాబాదులో ఈరోజు తెల్లవారుజామున మృతి చెందారు.**

==========================

వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. రైల్వే శాఖలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కేంద్ర మంత్రి విశాఖపట్నంలో నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని డిఆర్ఎం లలిత్ బోహ్రా కేంద్ర మంత్రికి వివరించారు.

-------------------------

మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ–మెప్మా లోని రిసోర్స్ పర్సన్‌లకు ట్యాబులను పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని ఈ సందర్భంగా రామానాయుడు పేర్కొంటూ...

...వాయిస్... 33 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆయన ఈరోజు ఉదయం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ.. కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇంటింటికి ప్రచారం చేస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని దేవాలయాల్లో అన్నప్రసాదాల నాణ్యతను మెరుగుపరిచినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని మంత్రి ఈ రోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దేవాలయాలకు సంబంధించిన భూములను ప్రభుత్వం కాపాడుతోందని, అన్యాక్రాంతమైన భూములు ఏవైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవాలయాల నిర్వహణలో అనేక మార్పులు తీసుకువచ్చామని కొల్లు రవీంద్ర పేర్కొంటూ...

..వాయిస్...30 సెకన్లు

---------------------------

యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా, రేపల్లెలో మంత్రి నిన్న పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన పనులను మంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీల్లో అనేకం అమలు చేసినట్లు చెప్పారు. ఇదే క్రమంలో ప్రజా రాజధాని అమరావతిని శరవేగంతో నిర్మిస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతుల్లో మార్పులు తీసుకువచ్చేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి నూతన ఉత్తేజాన్నిఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వీయ ధృవీకరణ పథకం 2025'ను ప్రవేశపెట్టింది. కొత్త పథకంలో సవరించిన మార్గదర్శకాలను పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ కార్యకలాపాలను సురక్షితంగా, పర్యావరణ హితంగా మార్చడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందించడంతో ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సవరించిన మార్గదర్శకాల వల్ల భవన నిర్మాణాలకు తక్షణ అనుమతులు, నిర్మాణం వెంటనే ప్రారంభించడం, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణ సులభతరం చేయడం వంటి అనేక వెసులుబాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు.

---------------------------

ప్రముఖ నటుడు, శాసన సభ మాజీ సభ్యులు కోట శ్రీనివాసరావు హైదరాబాదు ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో ఈ తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. 1942 జులై 10న

కృష్ణాజిల్లా కంకిపాడులో కోట శ్రీనివాసరావు జన్మించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. నట జీవితంలో అనేక విలక్షణ పాత్రలు పోషించిన ఆయన పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. 1999 నుంచి 2004 మధ్య విజయవాడ తూర్పు శాసన సభ్యులుగా సేవలందించారు. శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపాన్ని తెలిపారు. కోట శ్రీనివాసరావు నటన తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోట మృతి విచారకరమన్నారు. భాష, యాస తెలిసిన నటుడు కోట శ్రీనివాసరావు అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.

---------------------------

విజయనగరం జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ నిన్న నిర్వహించిన శ్రవణ మాధ్యమ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 12 వేల 948 హెక్టార్లలో వివిధ పంటల సాగు మొదలైందని తెలిపారు. పంటల సాగును బట్టి రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు.

---------------------------

కృష్ణాతీరంలో కళాత్మక సౌందర్యం, పర్యాటకులకు కొత్త అనుభూతులను పంచే లక్ష్యంతో హరిత బెరం పార్కులో ఫ్లోర్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తునట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ హరిత బెరం పార్కులో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులు, ఔత్సాహికులతో కలిసి పెయింటింగ్ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4 విధానం, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, జల సంరక్షణ, హరితాంధ్ర మొదలైన అంశాలపై పోటీలు నిర్వహించినట్టు పేర్కొంటూ..

...వాయిస్...26 సెకన్లు

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలో వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

=====================